# దుర్దినం

వాళ్లంతా చూస్తూనే ఉన్నారు. ఆమె మళ్లీ బయటకు వెళ్లింది. గేటు ప్రక్కన ఉన్న గోడ దగ్గర నిలుచుని తలను పైకెత్తి ఆకాశంకేసి చూసింది.

ఉదయం తొమ్మిది గంటలు కావస్తోంది.

ఆకాశంలో ఎక్కడా సూర్యుడి జాడ కనిపించలేదు. మత్తుగా ఉంది ఆకాశం, మబ్బుపట్టినట్టుగా - వెలుగు లేకుండా కళావిహీనంగా ఉంది.

ఆమె గొప్ప నిరాశకు లోనయ్యింది.

ఏమయ్యింది? వానాకాలం కూడా కాదు.

ఎండ మండిపోవలసిన మే నెల్లో సూర్యుడు ఇంకా ఆకాశం మీదకు రాలేదు.

ఎందుకు?

ఎందుకో తెలీదు.

దిగాలుగా మళ్లీ ఇంట్లోకి వచ్చింది కామేశ్వరమ్మ.

అంతా చూస్తూనే ఉన్నారు.

"ఇవాళ బామ్మకు భోజనం లేదు" అన్నది మనవరాలు సువర్చల ఆమె దాటి వెళుతున్నప్పుడు...

"అవునే. దుర్దినం" అన్నది ఆమె చిన్నగా...

సూర్యుడు రాని రోజు ఆమెకు దుర్దినం. సూర్యుడు కనపడని రోజు ఆమె భోజనం చేయదు. ఎన్నో ఏళ్లుగా ఆమె ఈ నియమాన్ని పాటిస్తోంది.

బతికున్న రోజుల్లో ఆమె భర్త కూడా ఇలాంటి నియమాన్నే పాటించేవాడు.

"బామ్మా... దిగులు పడకు. కొంచెం లేటుగా అయినా నీ సూర్యుడు వస్తాడులే" అన్నది సువర్చల నవ్వుతూ...

"భోజనం లేనందుకు దిగుల్లేదే... సూర్యభగవానుడు కనపడనందుకే నా దిగులంతా" అన్నది ఆమె.

"ఇవాళ నేను కూడా భోజనం చేయను" అన్నాడు కుచేలరావు...

"ఎందుకు?" వెంటనే అడిగాడు రామగోవింద స్నేహితుడిని...

"ఎందుకేమిటి? బామ్మగారిలాగానే... సూర్యుడు రానిరోజు నేను కూడా భోజనం చేయను" అన్నాడు కుచేలరావు.

అతను ఆ ముందు రోజు సాయంత్రం స్నేహితుడు రామగోవిందను చూడటానికి ఆ ఇంటికి వచ్చాడు.

"నీక్కూడా ఈ నియమం వున్నదా నాయనా?" అనడిగింది కామేశ్వరమ్మ ఆశ్చర్యంగా...

"అవునండీ..." అన్నాడు కుచేలరావు

**ప్రతాప రవిశంకర్**

మెరుస్తున్న కళ్లతో...

"మంచి నియమం..." మెచ్చుకుంటూ అన్నది ఆమె.

ఆమె అలా అనేసరికే కుచేలరావు స్నేహితుడు రామగోవిందను తీసుకుని బయటకు వెళ్లాడు.

గేటు దాటి రోడ్డుమీదకు వచ్చిన తరువాత "ఏమిటీ విషయం?" అనడిగాడు రామగోవింద స్నేహితుడిని.


"అంతా వట్టిదే" అన్నాడు కుచేలరావు.

"ఏమిటీ?"

"సూర్యుడు రాని రోజు నేను భోజనం మానెయ్యడం"

"నిజం కాదా?"

"కాదు... నాకు అలాంటి నియమం లేదు. హాయిగా పీకలదాకా తింటాను సూర్యుడు రాకపోయినా"



"మరెందుకు అలా చెప్పావ్?"

"ఎలా చెప్పినా ఇవాళ మాత్రం భోజనం చేయను" అన్నాడు కుచేలరావు.

"మళ్లీ ఇదేమిటి? నియమం లేదన్నావు గదా?"

"అదంతా ఒక స్టోరీ"

"చెప్పు... వింటాను" అన్నాడు రామ గోవింద కొంచెం క్యూరియాసిటీ కనబరుస్తూ-

"ఇక్కడ కాదు... హోటలుకు వెళ్లి టిఫిన్ తింటూ చెబుతాను" అన్నాడు కుచేలరావు...

తర్వాత ఇద్దరూ సెంటర్ వరకూ నడుచు కుంటూ వెళ్లి ఒక హోటల్లోకి ప్రవేశించారు. అప్పటికే కుచేలరావు తను తినదల్చుకున్న టిఫిన్ ఐటమ్స్‌ను సెలెక్ట్ చేసుకుని ఉంచాడు. వెళ్లటంతోనే వాటిని ఆర్డరిచ్చాడు. కుచేల రావుకు రకరకాల టిఫిన్లు, ఇతర తినుబండా రాలు తినటమంటే భలే ఇష్టం.

"ఇప్పుడు చెప్పు స్టోరీ" అన్నాడు రామ గోవింద.

"ముందు టిఫిన్లు తిననీ... తర్వాత నింపా దిగా చెబుతాను. అప్పటిదాకా ఓపికపట్టు గురూ" అన్నాడు కుచేలరావు టిఫిన్ ప్లేటు మీదకు ఆత్రంగా ఎగబడుతూ -

రామగోవింద అంతులేని నిరుత్సాహానికి గురయ్యాడు. దిక్కుతోచక అటూఇటూ దిక్కులు చూశాడు.

కుచేలరావు మాత్రం మరే ఇతర ధ్యాస లేకుండా తినటంలో నిమగ్నమయిపోయాడు. ఎటూ మధ్యాహ్నం భోజనం చేయనని డిక్లేర్ చేశాడు కాబట్టి కొంచెం అదనంగానే దట్టిం చాడు. ఒక గంట తర్వాత తిండి కార్యక్రమాన్ని ముగించాడు.

బిల్లు మొత్తాన్ని తనే చెల్లించినందుకు స్థిమి తపడ్డాడు రామగోవింద.

బయటకు వచ్చిన తర్వాత కిళ్లీ బంకు దగ్గర ఆగి ఒక రత్నజరదా కిళ్లీ కట్టించుకుని నోట్లో వేసుకుని నములుతూ "ఇక్కడ ఆహారం గురించి నీకో విషయం చెప్పాలి" అన్నాడు కుచేలరావు - రామగోవిందుతో...

"ఏమిటో చెప్పు..." కొంచెం విసుగ్గా అన్నా డు రామగోవింద.


"ఆహారమనేది చాలా చిత్రమైనది... మనం కావాలనుకున్నప్పుడు దొరకదు. అందుకే దొరికినప్పుడే దాన్ని కడు పారా ఆరగించాలి" అన్నాడు గొప్ప వేదాంతిలా.

"అర్థం కాలేదు బాస్" అన్నాడు రామగో వింద గొప్ప అజ్ఞానిలా.

తేలిగ్గా నవ్వి "వెరీ సింపుల్... ఇప్పుడు మనం శ్రీశైలం అడవుల్లోకి వెళ్లామనుకో... అక్కడ మనకు ఆహారం దొరకదు. కాబట్టి ఏమీ తినలేము. కడుపు మాడ్చుకుని చావాలి. అందు వల్లనే ఆహారం దొరికినప్పుడే దండిగా తిని మెండుగా వుండాలి... ఇది నా సిద్ధాంతం" అని మహాజ్ఞానిలా ఆహారం థియరీ గురించి చెప్పాడు కుచేలరావు.

కుచేలరావు నములుతున్న కిళ్లీ వాసన రామ గోవిందకు వెగటుగా ఉంది. అయినా గత్యం తరం లేక భరిస్తూనే "ఇంతకీ నువ్వు దుర్దినం స్టోరీని చెప్పనేలేదు" అని ఇంకోసారి గుర్తు చేశాడు.

"వెరీగుడ్... బాగా గుర్తు చేశావ్... మా ఊళ్లో మా వీధిలో కొంతమంది వయసులో ఉన్న అమ్మాయిలు ఉన్నారు. అందరిలోకీ మా ఇంటికి కొంచెం దగ్గిరలో ఉన్న ఇంట్లో ఉండే అమ్మాయి నాకు బాగా నచ్చింది. ఎందుకో




నాకే తెలీదు. మొదటిసారి ఆ అమ్మాయిని చూసినప్పుడే నాలో ఆ అమ్మాయి పట్ల ఓ విధమైన ఆరాధనా భావం కలిగింది"

"ఆరాధనా భావమా? అపరాధ భావమా?" అని అడిగాడు రామగోవింద నవ్వుతూ -

"మధ్యలో నన్ను డిస్టర్బ్ చేయకు. స్టోరీ దెబ్బతింటుంది" విసుగ్గా అన్నాడు కుచేలరావు.

"సరే... కంటిన్యూ చెయ్యి..."

కుచేలరావు మళ్లీ మొదలుపెట్టాడు.

"ఆ అమ్మాయి పేరు అరుణ. చాలా పొలైట్‌గా ఉంటుంది. నిలకడగా ఉండే బిహేవియర్. ఫ్రెండ్లీ నేచర్... ముఖ్యంగా ఆ అమ్మాయి నవ్వు నన్ను బాగా ఆకర్షించింది. నిర్మలమైన, కల్మషం లేని స్వచ్ఛమైన నవ్వు నా గుండెలో గంటలు మోగించింది. కొన్నాళ్లకు మా ఇద్దరికీ పరిచయమయ్యింది. అప్పట్నించీ ఇద్దరం మాట్లాడుకునేవాళ్లం. ఒకరోజు రాత్రి వాళ్లింట్లో కరెంటుపోతే నేను కష్టపడి రిపేరు చేసి వాళ్లింట్లో దీపాలు వెలిగించాను. అందుకు ఆ అమ్మాయి పదేపదే కృతజ్ఞతలు తెలియజేసుకుంది".

"నిన్నొక ఎలక్ట్రీషియన్ అని అనుకోలేదు కదా!" సందేహాన్ని వెలిబుచ్చాడు రామగోవింద.

"నో... నో అలాంటిదేమీ లేదు"

"ఐతే వినిపించు. తర్వాత ఏం జరిగింది?"

"ఏమీ జరగలేదు... అలా జరుగుతోంది కాలం... రోజూ ఏదో ఒక టైములో ఆ అమ్మాయిని చూస్తూ ఉండేవాడిని. పనేమీ లేకపోయినా ఆ అమ్మాయిని చూడడం కోసం వాళ్లింటి బయట నిరీక్షిస్తూ ఉండేవాడిని. ఏ రోజునైనా ఆ అమ్మాయి కనపడకపోతే నాకేమీ తోచేది కాదు. ఏదోలా ఉండేది. ఆ అమ్మాయి గురించే ఆలోచిస్తూ నిలబడేవాడిని. ఆ రోజు భోజనం కూడా తినాలని అనిపించేది కాదు. మీ బామ్మకు లాగా నాకు ఆ రోజు దుర్దినం."

"ఒరేయ్ కుచేలా... కొంప తియ్యకుండా నువ్వు సదరు అమ్మాయిని ప్రేమించావా?"

అడిగాడు రామగోవింద

"అదే తెలీటం లేదు..."

"పోనీ... ఈ విషయాన్ని ఆ అమ్మాయికి చెప్పావా?"

"నోర్మూసుకో... నాకే సరిగ్గా తెలీనప్పుడు ఇంక ఆ అమ్మాయికి ఏంచెబుతాను?"

"ఒకవేళ ఆ అమ్మాయి నిన్ను ప్రేమిస్తుం దేమో తెలుసుకున్నావా?"

"ఆ అమ్మాయి అలాంటి మనిషికాదు" చెప్పాడు కుచేలరావు.

"అంటే... ఏదయినా లోపం ఉందా?"

"అలాంటిదేమీ కాదు... చెప్పానుగదా... ఫ్రెండ్లీనేచర్... ఒక ఆడ - మగ కలిస్తే ప్రేమ తప్ప ఏమీ ఉండవా?" అని అడిగాడు కుచేలరావు కోపంగా...

"ఇంకేముంటాయి?" అనుమానంగా అడి గాడు రామగోవింద.

"ఇద్దరు మగవాళ్ల మధ్య ఇద్దరు ఆడవాళ్ల మధ్య స్నేహం ఉన్నట్టుగానే ఒక మగ - ఒక ఆడ మనుషుల మధ్య కూడా స్నేహం ఉంటుం ది. కానీ మన చుట్టూ ఉండే చాలామంది మనుషులు రంగుల కళ్లజోళ్లు పెట్టుకుని ఉంటా రు కాబట్టి వాళ్లకు ఆ స్నేహం ప్రేమగా కన పడుతుంది. స్నేహానికీ ప్రేమకీ మధ్య సన్నని సరిహద్దు గీత ఉంటుంది. స్నేహం పెరిగి పోయినప్పుడు ఆ గీత చెరిగిపోతుంది. ఇద్దరికీ అంగీకారమైతే అప్పుడు ఆ స్నేహం ప్రేమగా మారే అవకాశం ఉంటుంది."

"మీ విషయంలో ఆ అవకాశం ఉందా?" రామగోవింద అడిగాడు.

"ఏమో... తెలీదు. ఇప్పటికి నామటుకు నాకు ఆ అమ్మాయి పట్ల అభిమానం, గౌరవం, ఆరాధనా ఉన్నాయి. ప్రేమ గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు".

"ఎందుకలా?"

"ఏమో... ఆ అమ్మాయి మీద నాకు ప్రేమ ఉన్నట్టుగా నా మనసు నాకు ఇంత వరకూ చెప్పలేదు".

"ఇంతకీ ఇప్పుడు నువ్వనేదేమిటి?" అడి గాడు రామగోవింద.

"ఉదయం నించీ ఆ అమ్మాయిని చూడ లేదు కాబట్టి నా మనసు మనసులో లేదు. ఏదోలా ఉంది. భోజనం సయించదు. కాబట్టి మీ బామ్మకు లాగే నాక్కూడా దుర్దినం. చివరగా నిన్న మధ్యాహ్నం మీ ఊరు రావటానికి ముం దు ఆ అమ్మాయిని చూశాను... రాత్రికి తిరిగి వెళ్లిపోతాను" అన్నాడు కుచేలరావు.

"నాలుగు రోజులు మా ఇంట్లో ఉంటానని చెప్పావుగదా?" అన్నాడు రామగోవింద.

"ఈ నాలుగు రోజులూ భోజనం చేయ కుండా బతగ్గలనా?"

"భోజనం ఎందుకు? నాలుగు రకాల టిఫి న్లున్నాయి గదా" అన్నాడు రామగోవింద మళ్లీ...

"ఒరేయ్ ఇంట్లో చెప్పకు... ఇమేజ్ దెబ్బ తింటుంది" కంగారుగా అన్నాడు కుచేలరావు.

"సర్లే... భయపడకు" హామీ ఇచ్చాడు రామగోవింద.

వాళ్లలా నడుస్తున్నప్పుడు ఉన్నట్టుండి కుచే లరావు ఆగిపోయి రోడ్డు ప్రక్కనే ఉన్న పాన్ షాపు దగ్గరకు వెళ్లి ఇంకో రత్న జరదా కిళ్లీని చుట్టించి వేసుకున్నాడు.

అక్కడనించి తిరిగి రోడ్డు మీదకు వచ్చి నాలుగడుగులు వేసి కొంచెం దూరంలో ఎదు రుగా వస్తున్న నలుగురు ఆడవాళ్లను చూసి -

"మైగాడ్" అంటూ పెద్దగా అరిచాడు కుచేలరావు.

"ఏం జరిగింది?" అడిగాడు రామగోవింద.

ఎదురుగా వస్తున్న ఆడవాళ్లను చూపిస్తూ-

"ఆ మొదటి అమ్మాయి అరుణ. మా వీధిలో ఉండే అమ్మాయి" అన్నాడు ఆనందంతో...

"నిజంగానా!" ఆశ్చర్యంగా అడిగాడు నమ్మలేనట్టు రామగోవింద.

"అవున్రా... ఈ దేశంలో అంతులేని అవినీతి ఉన్నంత నిజం" అన్నాడు కుచేలరావు.

ఇంతలో వాళ్లు దగ్గరయి ఒకరినొకరు చూసుకున్నారు.

"మీరా!" అన్నాడు కుచేలరావు ఆ అమ్మాయికి కొంచెం దగ్గరగా వెళ్లి...

"మీరా కాదు. అరుణ..." ప్రక్కనే రమారమి అదే వయసులో ఉన్న అమ్మాయి - జోక్ చేసింది... అవకాశం వచ్చిందని...

"ఈ అమ్మాయి మాళవిక. నా చెల్లెలు... మా పిన్ని కూతురు. ఈమె మా పిన్ని. ప్రక్కన ఉన్నామె మా పిన్ని ఫ్రెండు శారదాంబగారు" అందరినీ పరిచయం చేసింది అరుణ.

"వీళ్లు ఇక్కడే ఉంటున్నారా?" అడిగాడు కుచేలరావు సంతోషంగా -

"అవును... మా బాబాయి ఇక్కడే కందిపప్పు మిల్లులో జాబ్ చేస్తున్నాడు" అరుణ చెప్పింది.

"నాకు తెలుసు. మా రోడ్డులోనే చివరి ఇల్లు" అన్నాడు రామగోవింద కందిపప్పు మిల్లు అని చెప్పగానే -

"ఎప్పుడు వచ్చారు?" కుచేలరావు అడిగాడు. అతన్ని అరుణ వాళ్లకు పరిచయం చేసింది.

"ఉదయం వచ్చాను"

"ఎప్పుడు వెళతారు?"

"నాలుగు రోజులు ఉంటాను" అన్నది.

"నేను కూడా నాలుగు రోజులు ఉంటాను" అన్నాడు కుచేలరావు.

"అదేమిటి? రాత్రికి వెళ్లిపోతానని గంట క్రితం చెప్పావు కదురా కుచేలా?" వెంటనే అన్నాడు రామగోవింద.

"అదేం కాదు. నువ్వు సరిగా వినలేదు"

"పోన్లెండి... సరదాగా నాలుగు రోజులుండి వెళదాం" అన్నది అరుణ.

"అంతే... అంతే" కుచేలరావు వంతపలికాడు.

జరదా కిళ్లీ వాసన రావడంతో -

"మీరు ఈ జరదా కిళ్లీ నమలటం నాకోసమైనా మానుకోలేరా?" అని అడిగింది అరుణ.

"మీ కోసమైతే మావాడు తప్పకుండా మానుకుంటాడు." అన్నాడు రామగోవింద నవ్వుతూ-

"నమ్మకం ఏమిటి?" అడిగింది అరుణ.

"అదంతే... తిరుగులేదు" అన్నాడు రామగోవింద.

"ఇంకెప్పుడూ ఈ జరదా కిళ్లీ నములుతూ నాకు కనపడకూడదు" అని వాళ్లతో కలిసి వెళ్లిపోయింది అరుణ.

"ఇంకానయం. మానెయ్యమని చెప్పలేదు. ఈ అమ్మాయి చూడకుండా కిళ్లీలు మింగొచ్చు కదా" అన్నాడు కుచేలరావు.

"అంతేలే... నీకో ఛాన్సు ఇచ్చింది... మంచి

పిల్ల...” అన్నాడు రామగోవింద.

వాళ్లతో మాట్లాడుతున్నంత సేపూ రామ గోవింద అరుణనే చూస్తుండిపోయాడు.

లావూ కాదు - సన్నమూ కాదు. కొంచెం పొడుగ్గా ఉన్నందువల్ల చూడగానే సన్నగా ఉన్నట్టు అనిపిస్తుంది కానీ నిజానికి సన్నటి మనిషికాదు. కోల మొహం - సన్నని నాసిక - పలుచని పెదవులు - అలసిపోయినట్టున్న కళ్లు - నుదుటి మీద చిన్న గుండ్రటి తిలకం బొట్టు.

వాళ్లు వెళ్లిన తర్వాత రామగోవింద - కుచేలరావును తన స్నేహితుల ఇళ్లకు తీసుకు వెళ్లాడు. అక్కడ కొంత సమయం గడిపి ఇల్లు చేరేసరికి దార్లో ఎదురయిన ఆ నలుగురూ రామగోవింద ఇంట్లో ఉన్నారు.

కామేశ్వరమ్మ మంచంలో కూలబడి నీర సంగా కబుర్లు చెబుతోంది.

“ఇదిగో... మాటలోనే వచ్చేశారు” అన్నది ఆమె -

“అంటే ఏమిటి?” అనడిగాడు రామగో విందు బామ్మను.

“మీ గురించే అనుకుంటున్నాం. మీకో వింత చెప్పనా? ఇదిగో ఈ అమ్మాయి అరు ణకు కూడా ఇవాళ దుర్దినమేనట. సూర్యుడు కనపడలేదని ఇవాళ భోజనం మానేసిందిట. మన కుచేలరావు కూడా మానేశాడు కదా” అన్నదామె -

“నిజంగానా!” అరుణను చూస్తూ అన్నాడు కుచేలరావు”

“అవును” అన్నది మాళవిక.

“మీరు కూడానా?” అడిగింది అరుణ.

తలవూపాడు కుచేలరావు.

“నేను రాత్రికి భోజనం చేస్తాను. నాకు సూర్యుడు కనిపించాడు” అన్నాడు కుచేలరావు అరుణను చూస్తూ -

“ఎప్పుడు?” అడిగింది ముసలామె -

“మధ్యాహ్నం బజార్లో కనిపించాడు”

“అవును. నిజం... నేను కూడా చూశాను” అన్నది అరుణ నవ్వుతూ -

“అయితే... రాత్రికి నువ్వు కూడా భోజనం చేస్తావా?” అడిగింది ముసలామె -

“చేస్తాను”

“సూర్యుడు నాకు కనిపించలేదు. ఎందు చేత?” అన్నది కామేశ్వరమ్మ విచారంగా -

“ఏమో! మబ్బులచాటుకు వెళ్లి ఉంటాడు” అన్నాడు కుచేలరావు.

“మరి... నా సంగతేమిటి?” అన్నదామె మూలుగుతూ -

“ఇకమేం వెళతాం” అని లేచారు వాళ్లు...

కుచేలరావు - రామగోవింద వాళ్లతో బయ టవరకూ వచ్చారు.

“దుర్దినం తప్పిపోయింది కదా... రాత్రికి మీరు మా ఇంటికి రండి. కలిసి భోజనం చేద్దాం” అని చెప్పింది కుచేలరావుతో అరుణ.

“మీతో బాటు మీ ఫ్రెండును కూడా తీసు కురండి” అని చెప్పింది మాళవిక ఓరకంటితో రామగోవిందను చూస్తూ -

“దీనికి కూడా దుర్దినాలు మొదలవబో తున్నాయి” అన్నది అరుణ - కుచేలరావుకు మాత్రమే వినిపించేట్టు చిన్నగా -

పొట్ట చెక్కలయ్యేట్టుగా నవ్వేడు కుచేల రావు. ●